క్లుప్తంగా

జక్కంపూడి విజయలక్ష్మికి సన్మానం



రాజమహేంద్రవరంలో జక్కంపూడి విజయలక్ష్మిని సన్మానించిన ఎంపీపీ

సీతానగరం: డిగ్రీ పట్టాతోపాటు బంగారు పతకం అందుకున్న వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మిని సీతానగరం మండల ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న శనివారం ఘనంగా సన్మానించారు. ఈనెల 31న నన్నయ యూనివర్సిటీలో పీజీ సోషల్ వర్క్‌లో డిగ్రీ పట్టాతో పాటు బంగారు పతకాన్ని రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అందుకున్న జక్కంపూడి విజయలక్ష్మిని రాజమహేంద్రవరం నివాసంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఎంపీపీ మాట్లాడుతూ లా పూర్తి చేసిన జక్కంపూడి విజయలక్ష్మి నేటి వరకూ ఏదో నేర్చుకోవాలనే తపన ఆమె క్రమశిక్షణకు నిదర్శనం అన్నారు. ఆమె అడుగుజాడల్లో నేటి యువత పయనించాలని కోరారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభం

రంగంపేట: మండలంలోని సుభద్రంపేట, ఈలకొలను గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల భవనాలను ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిలు ప్రారంభిస్తారని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు శనివారం తెలిపారు. కావున మండలంలోని ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన కోరారు.

మానవత్వం చాటుకున్న ఉపాధ్యాయులు



బాధితులకు ఆర్థిక సాయం అందించిన ఉపాధ్యాయులు

రంగంపేట: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన విద్యార్థి కుటుంబానికి ఉపాధ్యాయులు అండగా నిలిచి ఆర్థిక సాయం చేశారు. మండలంలోని సింగంపల్లి గ్రామానికి చెందిన సమ్మంగి వరలక్ష్మి శుక్రవారం ఉదయం వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు వ్యాపించి ఇల్లు దగ్ధమవ్వడంతో కట్టుబట్టలు మినహా ఏమీ మిగల్లేదు. బాధితురాలు వరలక్ష్మి కుమారుడు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు సదరు విద్యార్థి కుటుంబాన్ని పరామర్శించి రూ.40 వేలు నగదు, దుస్తులు అందించారు. మానవత్వం చాటిన ఉపాధ్యాయులను గ్రామ పెద్దలు అభినందించారు.

స్వామివారికి జలాభిషేక పూజలు



గ్రామంలో కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

పెదపూడి: స్థానిక జనార్ధన స్వామివారి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న సప్తాహాల్లో భాగంగా శనివారం సీతారాముల వారికి జలాభిషేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి లక్ష తులసి పూజలు చేశారు. అనంతరం మహిళలు బిందెలు, కలశాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. భజన భక్తి మండలి సభ్యులు శ్రీరామ కీర్తనలు ఆలపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

నూతన తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ సునీల్‌బాబుకు స్వాగతం తెలుపుతున్న డీటీ కృష్ణ

బిక్కవోలు: మండల తహసీల్దార్‌గా నియమితులైన సునీల్‌బాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ కృష్ణా జిల్లా బలగపాడు మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆయన ఎన్నికల నేపథ్యంలో బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయనకు డీటీ కృష్ణ, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంతకాలం బిక్కవోలు తహసీల్దార్‌గా పనిచేసిన పోసిబాబు పశ్చిమగోదావరి జిల్లా నిడద్రోలు తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు.



కొత్తతుంగపాడు నుంచి బస్సుల్లో పయనమైన జనం



రామస్వామిపేట నుంచి పయనమైన అభిమానులు



మధురపూడి నుంచి ఏలూరు సభకు బయలుదేరిన పార్టీ శ్రేణులు



సీతానగరం నుంచి తరలి వెళుతున్న పార్టీ నాయకులు

ఊరూ వాడా ఉరకలేస్తూ..

- సిద్ధం సభకు తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- స్వచ్ఛందంగా పయనమైన అభిమాన జనం

అనపర్తి: ప్రతిపక్ష నేతలు, నాయకులు ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా రాష్ట్ర ప్రజలందరూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని, జగన్మోహన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పశ్చిమగోదావరి జిల్లా దెందులూరులో శనివారం నిర్వహించిన 'సిద్ధం' బహిరంగ సభకు అనపర్తి నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లారు. బహిరంగ సభకు వెళ్లేందుకు గాను నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన పార్టీ శ్రేణులు శనివారం ఉదయం పెద్ద ఎత్తున వాహనాల్లో ముందుగా అనపర్తి కెనాల్ రోడ్డులోని గణనాథుని ఆలయం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రతీ వాహనం వద్దకు వెళ్లి పార్టీ శ్రేణులను కలుసుకుని వారిలో ఉత్సాహం నింపారు. అనంతరం సిద్ధం బహిరంగ సభకు వెళ్లే వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటూ సుపరిపాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు.

రాజానగరం: రాష్ట్రంలో అభివృద్ధితోపాటు ప్రజా సంక్షేమానికి కూడా అధిక ప్రాధాన్యతనిస్తూ, ప్రజారంజకమైన పాలనను అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలలో తిరుగులేని, చెదిరిపోని ఆదరాభిమానాలు ఉన్నాయి. అందుకు నిదర్శనమే ఏలూరు సమీపంలోని దెందులూరులో శనివారం నిర్వహించిన సిద్ధం బహిరంగ సభ. ఈ సభకు రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల నుంచి అత్యధికంగా పార్టీ కేడర్‌తోపాటు అభిమానం గణమంతా స్వచ్ఛందంగా తరలివెళ్లింది. ఉరకలేస్తున్న ఉత్సాహంతో తమ అభిమాన నేతను చూడటమే కాకుండా ఆయన ఇచ్చే ప్రసంగాన్ని వినేందుకు జనమంతా భారీగా తరలివెళ్లారు.



సిద్ధం సభకు వెళ్లే వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

రాజానగరం నుంచి ఐదు వేలకు పైనే..

రాజానగరం నియోజకవర్గంలోని సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాల నుంచి 90 బస్సులు, 45 కార్లలో సుమారు ఐదు వేల మంది వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. ఎవరికి వారే స్వచ్ఛంగా ఇళ్ల నుంచి బయటకు వచ్చి, తమ ముంగిట ఆగిన వాహనాలలో పయనమయ్యారు. స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాతోపాటు ఆయన కుటుంబం పై ఉన్న ప్రేమాభిమానాలతో గ్రామగ్రామాన ఉన్న పార్టీ నేతల ఆధ్వర్యంలో పిన్నలు, పెద్దలు అనే వ్యత్యాసం లేకుండా ఆడ, మగ అనే భేదం లేకుండా వాహనాలు జనంతో కిక్కిరిసినా సరై తమ పయనాన్ని విరమించుకోకుండా ముందుకు సాగారు. కదులుతున్న వాహనాల నుండి 'జై జగన్, జై జక్కంపూడి' అనే నినాదాలతో హోరెత్తాయి. పార్టీ జెండాలను, సిద్ధం స్టిక్కర్లను కార్లకు, బైకులకు కట్టుకుని మరీ యువత రెట్టించి ఉత్సాహంతో దెందులూరు సభకు పయనమైంది.

సిద్ధం సభకు తరలిన జనం

మధురపూడి: మండలంలోని 24 గ్రామ సచివాలయాల నుంచి 24 బస్సుల్లో జనం ఏలూరు సిద్ధం సభకు తరలివెళ్లారు. మండలంలోని గాదరాడ, శ్రీరంగపట్నం, కోరుకొండ, మధురపూడి, దోసకాయలపల్లి తదితర గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో బయలుదేరారు.

సిద్ధం మహాసభకు తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

సీతానగరం: దెందులూరులో జరిగే సిద్ధం మహాసభకు పెద్దసంఖ్యలో వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలివెళ్లారు. శనివారం సీతానగరం నుంచి సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, మండల ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు (తోటలోరాజు), ఉపసర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ యూత్ అధ్యక్షుడు కోలా శ్రీను, తోరం బ్రహ్మాజీ, మట్ట కాపు, ఈత వీరబాబు, మట్ట నాగయ్య తదితరులు ఆధ్వర్యంలో పార్టీశ్రేణులు ఏలూరు జిల్లా దెందులూరులో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొనే సిద్ధం మహాసభకు తరలివెళ్లారు. మండల గ్రామాల నుంచి ఏర్పాటు చేసిన బస్సులో అధిక సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు.

సామూహిక ఎలుకల నివారణే మార్గం

రాజానగరం: పొలాల్లో పంట దిగుబడిని నాశనం చేసే ఎలుకలను నిర్మూలించాలంటే సామూహిక చర్యే అవసరమని మండల వ్యవసాయాధికారి ఎస్కే ఇమామి ఖాసిమ్ అన్నారు. నరేంద్రపురం, కలచవర్ల, తూర్పుగానుగూడెంలలోని కొంతమంది రైతులకు క్షేత్ర స్థాయిలో శనివారం కలుసుకుని, ఎలుకల నిర్మూలనకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. బ్రోమోడయాలిన్ 0.25 ఎరమందును పొట్లాలుగా కట్టి పంట పొలాలలోని బొరియల్లో పెట్టడం ద్వారా వాటిని తిని ఎలుకలు చనిపోతాయన్నారు. ఈ మందును మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. కావల్సిన రైతులు ఆర్బీకేలకు వెళ్లి ఆ మందును పొందవచ్చన్నారు. ఎలుకల మందు తయారీపై ప్రాక్టికల్‌గా కూడా చేసి చూపించారు. ఇదే సమయంలో నానో యూరియా పై రైతాంగాన్ని చైతన్యపరిచారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఏడీఏ శ్రీనివాసురెడ్డి, ఏఈఓ ఎం.శివ, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.



ఎలుకల మందు తయారీపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర వైస్ చైర్మన్ భామిరెడ్డికి సత్కారం

పెదపూడి: మండలంలోని జి.మామిడాడకు చెందిన మేడపాటి భామిరెడ్డి రాష్ట్ర మానవహక్కుల పరిరక్షణ కమిషన్(హెచ్ఆర్‌సీ) వైస్ చైర్మన్‌గా నియమితులవ్వడం సంతోషదాయకమని లయన్స్ క్లబ్ మెంటర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి అన్నారు. శనివారం జి.మామిడాడలో మేడపాటి భామిరెడ్డికి అభినందన సన్మాన కార్యక్రమం లయన్స్ క్లబ్ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ భామిరెడ్డి ఆయుర్వేద వైద్యునిగా ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రఖ్యాతిగాంచారన్నారు. కరోనా విజృంభణ సమయంలో స్థానికంగా ఎంతో మంది ఆయుర్వేద వైద్య సేవలు అందించారని కొనియాడారు. అనంతరం భామిరెడ్డికి శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు సబ్బెళ్ల మోహన్‌రెడ్డి, ద్వారంపూడి భాస్కరరెడ్డి, ద్వారంపూడి రామకృష్ణారెడ్డి, సిద్దార్ధ సత్తిరెడ్డి, వీర్రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జి.మామిడాడలో భామిరెడ్డిని సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

చంపాలనే ఉద్దేశంతోనే దాడి

- ఆ క్రమంలోనే భార్యకు శిరోముండనం
- ముద్దాయికి 14 రోజుల రిమాండ్

సీతానగరం: ఇద్దరి మనస్పర్థలు రావడంతో భర్త కర్రి అభిరామ్(రాంబాబు) తన భార్య ఆశాను చంపాలనే ఉద్దేశంతో తన తల్లిదండ్రులను ఇంటి వద్ద నుంచి బయటకు పంపించి, భార్యకు శిరోముండనం చేశాడని కోరుకొండ సీఐ ఎ.నాగమురళీ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చినకొండేపూడి పంచాయతీ పరిధి పెదకొండేపూడి గ్రామానికి చెందిన అభిరామ్ ఎవరు లేని సమయంలో ఇంటి దగ్గరకు వచ్చి తన భార్యను ప్రేమతో ఇంటిలోకి తీసుకెళ్లాడు. తనతో తెచ్చుకున్న కత్తి సహాయంతో భార్యను బెదిరించి, ట్రిమ్మర్ సహాయంతో గుండు గీశాడు. తర్వాత చంపే ప్రయత్నం చేశాడు. చుట్టుపక్కల వారి సాయంతో ఆశా పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, ముద్దాయిని కోర్టులో హాజరుపర్చినట్టు సీఐ తెలిపారు. న్యాయమూర్తి ముద్దాయి అభిరామ్‌కు 14 రోజులు రిమాండ్ విధించారని సీఐ తెలిపారు.



అభిరామ్

ఆసుపత్రులపై ప్రత్యేక దృష్టి

రాజమహేంద్రవరం సిటీ : స్త్రీ, పురుష లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి వైద్య, రెవెన్యూ, పోలీసు అధికారులు సంయుక్తంగా డెకాయిట్ ఆపరేషన్ ఆకస్మికంగా నిర్వహించాలని కలెక్టర్ మాధవీలత ఆదేశాలిచ్చారు. డెకాయిట్ ఆపరేషన్ చేసే సమయంలో హాస్పిటల్లో వారికి తెలియకుండా ఆకస్మికంగా వెళ్లి తనిఖీ నిర్వహించాలన్నారు. ఈ తనిఖీల సమయంలో స్థానిక పోలీస్, రెవెన్యూ, ఆరోగ్య శాఖల అధికారులు సంయుక్తంగా సమన్వయంతో చేయాలన్నారు. శనివారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో పీసీపీఎస్ డీటీ చట్టం అమలు చేయడంపై జిల్లా అప్రాప్రియట్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ జననాల సమయంలో స్త్రీ, పురుష లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. జిల్లాలో తక్కువ ఉన్న వాటిని గుర్తించడంతో పాటు లింగ నిష్పత్తి సమతుల్యం కావడానికి కృషి చేయాలన్నారు. జిల్లాలో 148 స్కానింగ్ సెంటర్లో ఉన్నాయని కొత్తగా మూడు స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్ కోసం, ఆరు రెన్యువల్స్ కోసం, మూడు మోడిఫికేషన్ కోసం అనుమతుల కోరాయన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డి ఎమ్ హెచ్ వో డాక్టర్ ఎన్. వసుంధర, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి కె.విజయ్ కుమారి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఐ సి శంభు ప్రసాద్, డిప్యూటీ డిఎంహెచ్వోలు శ్రీహరి ,సంధ్య ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

అవగాహనతోనే క్యాన్సర్ మరణాలు తగ్గుముఖం

మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ సౌభాగ్యలక్ష్మి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): క్యాన్సర్‌పై అవగాహన కలిగి ముందస్తు చికిత్స ప్రారంభిస్తే మరణాలు తగ్గించవచ్చని రాజమహేంద్రవరం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సౌభాగ్యలక్ష్మి పేర్కొన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ఆధ్వర్యంలో క్యాన్సర్ అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సౌభాగ్య లక్ష్మి మాట్లాడుతూ 2022లో దేశవ్యాప్తంగా 14 లక్షలకు పైగా కొత్త కేసులు వెలుగు చూసినట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) గణాంకాలు వెల్లడించాయన్నారు. ఆ కారణంగా 9 లక్షల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారన్నారు. క్యాన్సర్‌పై అవగాహన కల్పించడం ద్వారా మరణాల రేటును గణనీయంగా తగ్గుతుందన్నారు. పురుషుల్లో పెదవి, నోరు, ఊపిరితిత్తులు, అన్నవాహిక క్యాన్సర్లు, మహిళల్లో రొమ్ము, గర్భాశయ ముఖద్వార (సర్వైకల్), అండాశయానికి సంబంధించిన క్యాన్సర్లు ఎక్కువగా నమోదవుతున్నాయన్నారు. అత్యధిక మరణాలకు ఈ రకాలే కారణమైనట్టు డబ్ల్యూహెచ్‌వో గుర్తించామన్నారు. ఆరోగ్య కరమైన ఆహారపు అలవాట్లు, జీవన విధానం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా క్యాన్సర్ రాకుండా కాపాడుతుందన్నారు. కమ్యూనిటీ మెడిసిన్ ప్రధాన అధికారి డాక్టర్ వీవీ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ క్యాన్సర్ మహమ్మారిపై అవగాహన కలిగి ఉండడంతో పాటు, పొగాకు, మత్తు పదార్థాలను దూరంగా ఉండాలన్నారు. ప్లాస్టిక్ వంటి పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ర్యాలీలో వైద్యాధికారులు డాక్టర్ కేవీ ఫణి మాధవీ, డాక్టర్ సూర్యారావు, డాక్టర్ ఆర్.సురేంద్ర బాబు, డాక్టర్ కె.దీప్తి, డాక్టర్ జి.స్రవంతి, శ్రీనివాస మూర్తి, శివప్రసన్న, పేరయ్య శాస్త్రి, ఆర్.శ్రీనివాస్, మొదటి ఏడాది మెడికోలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మెడికల్ కళాశాల విద్యార్థులు, అధికారులు

16 నుంచి మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీలు

ప్రకాశం నగర్: ఏపీ స్టేట్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు ఈ నెల 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకూ స్థానిక నారాయణపురంలోని సిటీ బ్యాడ్మింటన్ కోర్ట్‌లో నిర్వహిస్తున్నట్టు ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు డి.త్రినాథ్ తెలిపారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 16 నుంచి ప్రారంభమయ్యే ఈ చాంపియన్ షిప్ పోటీల్లో మేన్, ఉమెన్ విభాగంలో, సింగల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో పోటీలు జరుగతుతాయన్నారు. 35 ఏళ్లు పై బడిన వారి నుంచి 75 ఏళ్ల వారు అర్హులని తెలిపారు.

పిల్లల ఆరోగ్య అలవాట్లపై అవగాహన అవసరం

రాజమహేంద్రవరం సిటీ: పిల్లల ఆరోగ్యం, ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించడం చాలా అవసరమని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కలెక్టర్ చాంబర్‌లో వైద్య ఆరోగ్య శాఖ ద్వారా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీల విజేతలు కలెక్టర్ ధృవీకరణ పత్రాలు అందజేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సేవ్ గర్ల్స్ చైల్డ్ నినాదంతో విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు మొదటి బహుమతి రూ.5000, రెండో బహుమతి రూ.3000, మూడో బహుమతి రూ.2000తోపాటు ప్రశంసా పత్రం, మెమెంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా లేప్రసి నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్.వసుంధర, ఇతర వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్కేవీటీలో డ్రాయింగ్ పోటీలు

కంబాలచెరువు: స్థానిక ఎస్కేవీటీ హైస్కూలులో బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో బాలికలకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు శనివారం నిర్వహించారు. చిత్రలేఖనంలో పదో తరగతి విద్యార్థి కె.ప్రవల్లిక మొదటి బహుమతి, తొమ్మిదో తరగతి విద్యార్థి జీవీ కావ్య వ్యాసరచనలో రెండో బహుమతి సాధించిందని పాఠశాల హెచ్‌ఎంతెలిపారు. వక్తృత్వంలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఎస్.మహాలక్ష్మి రెండో బహుమతి సాధించిందన్నారు. వీరికి కలెక్టర్ కె.మాధవీలత ప్రశంసాపత్రం, మెమెంటో, నగదు అందజేశారన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేసిన కలెక్టర్

ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రకాశం నగర్: ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి పోటీల్లో ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్కే రామచంద్ర తెలిపారు. శనివారం కళాశాలలోని జరిగిన కార్యక్రమంలో విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల క్రీడా ప్రాంగణంలో జరిగిన ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న ఎం. లీలావతి, బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న పి.చంద్రకళ, బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జి.యశోదాదేవి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందారని, ఖోఖోలో బీఎస్సీ స్టాటిస్టిక్స్ ఫస్టు ఇయర్ విద్యార్థి లక్ష్మీనరస జిల్లాలో మొదటి స్థానం సాధించి, విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని తెలిపారు. కళాశాలకు చెందిన పి.సాయి శ్రీయ బ్యాడ్మింటన్‌లో ద్వితీయ స్థానం, ఎం వెంకటేష్ ఖోఖోలో తృతీయ స్థానం సాధించారని తెలిపారు. క్రీడా విభాగాధిపతి ఎం ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్లు పీవీవీ లక్ష్మి, విజయ దుర్గ తదితరులు పాల్గొన్నారు .

ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు

ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా

రాజానగరం: దెందులూరు సభకు హాజరైన అశేష జన సమూహాన్ని చూసి ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ప్రజలు దెందులూరు సభకు భారీ ఎత్తున రావడంతో ప్రతిపక్షాలకు దిమ్మ తిరిగిపోయిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇంతవరకు మహిళలకు ప్రాధాన్యత ఇచ్చింది లేదని, కానీ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు మాత్రం మహిళాభివృద్ధికి పెద్దపీట వేస్తూ, మహిళ పక్షపాతిగా ఆడపడుచుల ఆదరణను చూరగొంటుందన్నారు. అందుకనే దెందులూరుకు కనీవినీ ఎరుగని రీతిలో జనం ప్రభంజనంగా వచ్చి, జగనన్న ప్రభుత్వానికి బ్రహ్మరథం పట్టారన్నారు. నియోజకవర్గం నుంచి అనూహ్య రీతిలో ప్రజలు విచ్చేశారని ఎమ్మెల్యే తెలిపారు.

అభివృద్ధిని వివరిస్తున్న ప్రచార రథం



ఎల్ఈడీ స్క్రీన్‌పై అభివృద్ధి వివరిస్తున్న దృశ్యం

సీతానగరం: రానున్న సార్వత్రిక ఎన్నికల సమాయత్తంలో భాగంగా రాజానగరం నియోజకవర్గం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో జగనన్న ప్రచార రథం గ్రామాల్లో పర్యటిస్తోంది. ఈ సందర్భంగా శనివారం సీతానగరం చేరుకొని అక్కడ బస్టాండ్ సెంటర్‌లో ఎల్ఈడీ స్క్రీన్‌పై రాష్ట్రాభివృద్ధి, నియోజకవర్గం అభివృద్ధిని కళ్లకు కట్టినట్లు వివరించారు. రాబోవు ఎన్నికల్లో ఎవరికి ఓట్లు వేస్తారని ప్రజల అభిప్రాయాలను సేకరించారు. జగనన్న ప్రభుత్వంలో ఇంటి వద్దకే పథకాలన్నీ వచ్చి చేరాయని వివరించారు. ప్రచార రథాలు వల్ల సంక్షేమ పథకాలు కళ్లకు కట్టినట్లు చూపించారు. రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ పెద్ద ప్రభంజన సృష్టిస్తుందని స్థానికులు చర్చించుకుంటున్నారు

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



రంగంపేటలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

రంగంపేట: సీపీఎస్ ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానం అమలు చేయాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేస్తామనే అంశాన్ని తమ మ్యానిఫెస్టోలో పెట్టిన పార్టీకే తమ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రూపస్ రావు, జిల్లా మహిళా అసోసియేట్ అధ్యక్షురాలు విజయగౌరి, మండల ప్రధాన కార్యదర్శి ఐ. విజయబాబు, వెంకటేశ్వర్లు, కోరుమిల్లి శ్రీనివాస్, అనిల్, నాగేశ్వరరావు, మూర్తి, రాజశేఖర్, రమేష్ పాల్గొన్నారు.

ఐఎఫ్‌పీతో అత్యుత్తమ బోధన

మధురపూడి: ఇంటరెక్టివ్ ఫ్లాట్ ప్యానల్(ఐఎఫ్‌పీ) వినియోగించడంతో విద్యార్థులకు అత్యుత్తమ బోధన అందించవచ్చని కోరుకొండ ఎంపీఓ కుశలవ దొర అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో నిర్వహించిన ఐఎఫ్‌పీ వినియోగంపై శనివారం ఏర్పాటు చేసిన టీచర్ల శిక్షణ కార్యాక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఐఎఫ్‌పీ ప్యానల్స్‌ను వినియోగించే నూతన సాంకేతికతను జోడించి ఆన్‌లైన్ ల్యాబ్‌ల ద్వారా మంచి బోధన అందించవచ్చన్నారు. కోరుకొండ, సీతానగరం, గోకవరం, రాజమహేంద్రవరం మండలాల్లో గణిత, పీఎస్, ఎన్ఎస్, ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో 2వ ఎంఈఓ ఎం.సుజాత, నిర్వాహకులు గౌరీశంకర్, స్టేట్ రిసోర్స్ ఫర్సన్ సత్య సురేఖ తదితరులు పాల్గొన్నారు.